క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించండి



రోడ్డు సదుపాయం కల్పించాలని కోరుతున్న రావివలస గిరిజనులు

బొండపల్లి: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో గ్రామీణ రోడ్లు కనుమరుగయ్యాయి.. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. ప్రత్యామ్నాయ మార్గం చూపాలంటూ బొండపల్లి మండలంలోని ఎర్రోడ్ల వలస, గజపతినగరం మండలంలోని ఏనుగులవలస, రావివలస, చీడివలస గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. రావివలస గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. రోడ్డు సదుపాయం లేక ఆస్పత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయానికి వెళ్లేందుకు నానా పాట్లు పడుతున్నామన్నారు. ప్రత్యామ్నాయ మార్గం చూపకుంటే ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మోహనరావు

దత్తిరాజేరు: మండలంలోని బలభద్రరాజపురంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ కోసం బొబ్బిలి ఆర్డీఓ మోహనరావు గురువారం స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ విజయభాస్కర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

దత్తిరాజేరు: వచ్చే నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ విజయభాస్కర్, పెదమానాపురం, ఎస్.భూర్జవలస ఎస్సైలు జయంతి, రాజేష్‌లతో కలసి గురువారం మధ్యాహ్నం పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని.. మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆర్థిక సహాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న జైభీమ్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ గ్రామానికి చెందిన కడారి అప్పారావు (అంకుశం) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన జై భీమ్ యూత్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం పది వేల రూపాయలు సేకరించి గురువారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సక్రమంగా వైద్యసేవలందించాలి



వైద్యశిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ

గజపతినగరం: గ్రామాల్లో పీహెచ్‌సీల ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాల్లో సిబ్బంది ప్రజలకు సక్రమంగా వైద్యసేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ సూచించారు. కె.ఎస్.ఆర్.పురం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 104 వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో ఓపీ నమోదు,రోగులకు అందించిన సేవలపై వైద్యాధికారి సుష్మను ఆరా తీశారు. గ్రామాల్లో క్షయ,లెప్రసీ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మందులు అందజేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

పశుపోషణతో అదనపు ఆదాయం

బొండపల్లి: రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులపెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ ఎస్.దామోధరరావు అన్నారు. జంతుసంక్షేమ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా రయింద్రాం గ్రామంలో గురువారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనను ఆయన తిలకించారు. పోటీల్లో ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన లేగదూడలకు సంబంధించిన పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఏడీ అనురాధ,బొండపల్లి,రాచకిండాం పశువైద్యాధికారులు ఎం.కిరణ్ కుమార్,లక్ష్మీదీపిక పాల్గొన్నారు.

దక్కని గౌరవం

- సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అందని గౌరవవేతనాలు
- సర్పంచ్‌లను పక్కన పెట్టి వెండర్ విధానంలో కూటమి నాయకులతో పనులు చేయిస్తున్న ప్రభుత్వం
- ఉత్సవ విగ్రహాల్లా మిగిలిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు



గొట్లాం గ్రామ సచివాలయం

బొండపల్లి: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవమే లేకుండా పోయింది. పంచాయ తీల్లో ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గౌరవం వేతనం అందడం లేదు. దీనికి తోడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల గౌరవానికి భంగం కలిగిస్తోంది. అధికారులు ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యు లను పక్కనపెట్టి అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ ప్రజాతీర్పును పరిహాసం చేస్తున్నారు. కూటమి నాయకులకు ఎలాంటి పదవులు లేకపోయినా చాలా పంచాయతీల్లో వారిదే పెత్తనం. సర్పంచ్‌లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్న విమర్శలు గజపతినగరం నియోజకవర్గంలోని సర్పంచ్‌ల నుంచి వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగాల్సిన ఉపాధి హామీ పనులను సైతం ప్రభుత్వం వెండర్ విధానంలో కూటమి నాయకులతో చేయిస్తోంది. గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి, గజపతిన గరం, దత్తిరాజేరు, గంట్యాడ మండలాల్లో 80 శాతానికి పైగా వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు గెలిచారు. అదే స్థాయిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా విజయం సాధించారు.

నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల వివరాలు

మండలం	సర్పంచ్‌లు	ఎంపీటీసీలు
గంట్యాడ	36	19
బొండపల్లి	28	15
గజపతినగరం	30	16
దత్తిరాజేరు	35	16

గత ప్రభు త్వం సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రాధాన్యత లేకుండా చేసిందని, తాము అధికారం లోకి వస్తే తగిన గౌరవం, పాలన,అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యం ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వా త ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఇచ్చిన హామీని కూడా సీఎం చంద్రబాబునాయు డు, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ విస్మరించారు.

11 నెలలుగా అందని గౌరవ వేతనాలు

గత ప్రభుత్వ హయాంలో గౌరవ వేతనంగా ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేలు, సర్పంచ్‌లకు రూ. 3వేలు చొప్పున ఇచ్చే వారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి గౌరవ వేతనాలను వారి బ్యాంకు ఖాతాల్లో సీఎంఎఫ్‌ఎం పద్దు కింద జమ చేసేవారు. ఎన్నికల కోడ్ ఉండడంతో 2024 మార్చి నెలలో గౌరవ వేతనాలు జమకాలేదు. కూటమి అధికారంలోని వచ్చిన తర్వాత వీరికి ఒక్క నెల గౌరవ వేతనం కూడా జమచేయలేదు. గతేడాది మార్చి నెల నుంచి ఇప్పటి వరకు 11 నెలలకు సంబంధించిన గౌరవ వేతనాలు బకాయి ఉన్నాయి. మండల పరిషత్ కార్యాల యాలు వేతనాల బిల్లులను తరచూ ఆన్‌లైన్ చేస్తున్నా నిధులు విడుదల కావడం లేదు.

వేతనాలు ఇవ్వకపోవడం దారుణం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతననాలు చెల్లించకపోవడం దారుణం. 11 నెలల వేతనాలు బకాయి ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తగిన గౌరవం ఇవ్వ డంతో పాటు పాలనలో భాగస్వామ్యం చేస్తామని ఎన్నికలు ముందు చెప్పిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట తప్పారు. ప్రజల్లో ఈ ప్రభుత్వం విశ్వాశం కోల్పోయింది.

– చల్లా చలం నాయుడు, బొండపల్లి ఎంపీపీ

హక్కులకు భంగం



ప్రభుత్వం సర్పంచ్‌ల హక్కులకు భంగం కలిగిస్తోంది. గ్రామాల్లో సర్పంచ్‌లు ఆధ్వర్యంలో జరగాల్సిన పనులను వెండర్ విధానంలో కూటమి నాయకులతో ఇష్టానుసారం చేయిస్తున్నారు. పంచాయతీల తీర్మానాలను అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం సర్పంచ్‌లకు గౌరవం వేతనం కూడా అందించలేకపోతోంది.

– కర్రోతు శ్రీనివాసరావు, వేంద్రాం గ్రామ సర్పంచ్,బొండపలి మండలం

బిల్లులను ఆన్‌లైన్ చేస్తున్నాం

ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించిన బిల్లులను ప్రతీ మూడు నెలలకు ఒకసారి సీఎంఎఫ్‌ఎం పద్దు కింద ఆన్‌లైన్ చేస్తుంటాం. ఇప్పటికి మూడు సార్లు బిల్లులను ఆన్‌లైన్ చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే వారి బ్యాంకు ఖాతాల్లో గౌరవ వేతనాలు జమ చేస్తాం.

– ఎస్.శ్రీనివాసరావు, బొండపల్లి ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్

అన్ని వర్గాలనూ మోసం చేశారు

- ఎన్నికల హామీలను ఎప్పుడు అమలు చేస్తారు..?
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేస్తున్నారని గజపతిన గరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చారని, వాటిని ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని నిలదీశారు. పథకాలు అమలు చేయ లేమని సీఎం చంద్రబాబునాయుడు తాజాగా చెప్పడంతో హామీలన్నీ అబద్ధమని, ఆయన మోసాలు ఇప్పుడు ఒక్కొక్కటీగా బట్టబయలవుతున్నాయని అన్నారు. మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించేందుకు సీఎం చంద్రబాబుకు, ఆయన కుమారుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఇంకెన్ని సంవత్సరాల సమయం కావాలో చెప్పాలని నిలదీ శారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్షాయాభై వేల కుపైగా సచివాలయ ఉద్యోగాలు ఇచ్చారని, సుమారు మూడులక్షల మంది గ్రామ వలంటీర్లను నియమించారని గుర్తు చేశారు. తాము అధికా రంలోకి వస్తే యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని, మెగాడీఎస్సీ నిర్వ హిస్తామని హామీ ఇచ్చారని, కొత్తగా ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొ డుతున్నారని దుయ్యబట్టారు. ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు ప్రచారం చేయించుకుని చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నాడని విమర్శిం చారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చంద్రబా బు చెప్పారని, ఒక్కరికైనా ఇచ్చారా అని నిలదీశారు. రాష్ట్రంలో సుమారు మూడు లక్షల మందికి పింఛన్లు తొలగించారని మండిపడ్డారు.

అమరావతి పేరుతో దోపిడీ

రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ప్రజాధనం దోపిడీకి చంద్రబాబునాయుడు మరోసారి తెరదీశారని అప్పలనరసయ్య అన్నారు. రాజధాని కోసం భారీగా అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపుతున్నారని, అమరావతిలో భూములకు రోడ్ల వేసి వాటిని అమ్ముకుని వ్యాపారాలు సాగిస్తున్నాడని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కాకముందే రూ.లక్షా 12వేల కోట్లు అప్పు చేసిందని, ఈ డబ్బుతో ఏంచేశారో సమాదానం చెప్పాలని చంద్రబాబును నిలదీశారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన పోర్టులు, మెడికల్ కళాశాలలు, హార్బర్లను ఈ ప్రభుత్వం ప్రైవేటు పరంచేసే ఆలోచన చేస్తోందని, ఇందిమంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలోని సుగర్ ఫ్యాక్టరీలన్నింటినీ అమ్మేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయక పోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకులు మండల సురేష్,బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ, రేగ సురేష్, గేదెల జగదీశ్వరరావు, పి.నారాయణమూర్తి, ఎం.నర్సింగరావు, కర్రి రామునాయుడు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం ..



గంట్యాడ మండలంలోని కొర్లాం గ్రామంలో సాగులో ఉన్న పెసర పంటలో గురువారం పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వి. తారకరామారావు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పెసర, మినుము పంటలపై పంటకోత ప్రయోగాలు చేపడుతున్నట్లు చెప్పారు. పంటకోత కోసం సేకరించిన మొక్కలను రైతుసేవా కేంద్రంలో భద్రపరిచి, ఎండిన తర్వాత నూర్పు చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్యామ్‌కుమార్, ఏఎస్ఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

– గంట్యాడ

పోరాటం ఆపేది లేదు



తమ గ్రామానికి తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే వరకు ఆందోళనలు, పోరాటం కొనసాగిస్తామని ఆతవ గ్రామస్తులు తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆతవ గ్రామస్తులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు నాలుగో రోజు గురువారం కొనసాగాయి. వేపాడ– సోంపురం ప్రధాన రహదారిలో సీపీఎం నాయకుడు చల్లా జగన్, బహుజన నాయకుడు ఉదయ్ భాస్కర్,తదితరుల నేతృత్వంలో గ్రామస్తులు వంటావార్పు చేశారు. రోడ్డుపైనే భోజనాలు చేసి నిరసన తెలిపారు.

– వేపాడ

పథకాలను అమలు చేయలేమనడం సిగ్గుచేటు

- ఎన్నికల హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాడతాం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: అధికారం కోసం ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌పథకాలతో పాటు అనేక అలివికాని హామీలు ఇచ్చి..ఇప్పుడు వాటిని అమలు చేయలేమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిస్సిగ్గుగా చెప్పడం దారుణమని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడుబండి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రస్తుతం అమలు చేయలేమని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతూ సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని విమర్శించారు. కూటమిని ఎన్నికల్లో గెలిపిస్తే జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు మించి సంక్షేమం చేస్తామని చంద్రబా బు, కూటమి నాయకులు ఊరూరా ప్రచారం చేసి ప్రజలతో ఓట్లు వేయించుకున్నారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పథకాలు అమలు చేయడం తమ వల్ల కాదని చేతులెత్తేయడం సరికాదన్నారు. ప్రపంచానికే పాఠాలు చెప్పానని, ఆర్థికవేత్తను అని తనకు తాను కితాబు ఇచ్చుకునే చంద్రబాబుకు ఎన్నికల సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో అనుభవజ్ఞుడిని నన్ను నమ్మండి అంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజలను మోసం చేశారని, మళ్లీ 2024 ఎన్నికల్లోనూ అదే విధం గా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. ఆయన్ని నారా చంద్రబాబునాయుడు అనే కన్నా మోసాల చంద్రబాబు అంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కొత్తవలస, చిన్నరావుపల్లి సర్పంచ్‌లు మచ్చ ఎర్రయ్యరామస్వామి, బూసాల దేముడు, పార్టీ నాయకులు బొంతల వెంకటరావు, మదీన అప్పలరమణ, పల్లా భీష్మ,పి.చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నిరసన



ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు

కొత్తవలస: గౌరవ వేతనం పది వేల రూపాయలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. తొమ్మిది, పది తరగతుల విద్యార్థులను పరిగణనలోకి తీసుకుని వేతనాలు పెంచాలని కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు మాట్లాడుతూ.. వంటకు అవసరమైన గ్యాస్, ఇతర సరుకులు ప్రభుత్వమే అందజేయాలన్నారు. అలాగే పది లక్షల రూపాయల బీమా సౌకర్యం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు,సీఐటియూ నాయుకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ, తదితరులు

చీపురుపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న యువకులు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయాలని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ పిలుపునిచ్చారు. మహాత్మగాంధీ వర్ధంతిని పుర స్కరించుకుని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతృత్వంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 62 మంది విద్యా ర్థులు రక్తదానం చేశారు. దాతలకు జిల్లా కేంద్రాస్పత్రి, రోటరీ క్లబ్ సిబ్బంది ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ బి.విజయేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ కల్యాణికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకురాలు లక్ష్మి

గజపతినగరం: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బి.కల్యాణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల గ్రీన్‌అంబాసిడర్లకు ఏడు నుంచి పది నెలల వేతనాలు బకాయి ఉందన్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు వేతనాన్ని రూ.10వేలకు పెంచాలని కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె.రాము పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



లక్కవరపుకోట: ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్.కోట పీహెచ్‌సీ వైద్యసిబ్బంది



కొత్తవలస: వియ్యంపేటలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



గంట్యాడ: ర్యాలీ చేస్తున్న గంట్యాడ పీహెచ్‌సీ సిబ్బంది

కుష్టు (లెప్రసీ) వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారులు కోరారు.జాతీయ కుష్టు వ్యా ధి నివారణ దినం సందర్భంగా కొత్తవలస మండలంలోని వియ్యంపేట, లక్కవరపుకోట, గంట్యాడ మండల కేంద్రాల్లో పీహెచ్‌సీల వైద్య సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వ్యాధి లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా పీహెచ్‌ల వైద్యాధికారులు గోపాలకృష్ణ, బి.అనీల్ కుమార్, హేమలత ప్రజలకు వివరించారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

– లక్కవరపుకోట/కొత్తవలస/గంట్యాడ

జంతు సంక్షేమంపై అవగాహన

- పశు సంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ శారద



రామలింగాపురంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

చీపురుపల్లి: మానవ మనుగడతో పాటు జంతు సంక్షేమంపై కూడా విద్యార్థులకు చిన్న వయసు నుంచే అవగాహన ఉండాలని పశుసంవర్ధకశాఖ ఎ.డి డాక్టర్ ఆర్.శారద సూచించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో జంతువులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా పాడి సంపద చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గొర్లె పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

చీపురుపల్లి: మండలంలోని 19 పంచాయతీల్లో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐ.సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేసిన ఉపాధి పనులకు సంబంధించి ఇప్పటికే పంచాయతీల్లో సామాజిక తనిఖీ పూర్తయిందని, ఆ నివేదికలపై మండల స్థాయి ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉపాధి సిబ్బంది, వేతనదారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పోస్టుకార్డుల ఉద్యమం



గజపతినగరం: రాష్ట్రపతికి రాసిన లేఖలు చూపిస్తున్న ఎస్.ఎల్.వలస సెకార్ట్ అంగన్‌వాడీ కార్యకర్తలు



శృంగవరపుకోట: ఎస్.కోటలో రాష్ట్రపతికి రాసిన పోస్టుకార్డులను చూపిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



వేపాడ: రాష్ట్రపతికి లేఖలు పంపిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకుడు జగన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు పోస్టు కార్డుల ఉద్యమం చేస్తున్నారు.ఎస్.కోట, వేపాడ మండల కేంద్రాల్లో, గజపతినగరం మండలంలోని లింగాలవలసలో ఎస్.ఎల్.వలస సెకార్ట్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాలు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతృత్వంలో గురువారం నిర్వహించారు. ముందుగా సమస్యలపై చర్చించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలను గ్రేడ్–3, ఆయాలను గ్రేడ్–4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖలు రాశారు. కనీస వేతనం రూ.26 వేలు అందించేలా చూడాలని లేఖలో కోరారు.

– శృంగవరపుకోట/ గజపతినగరం/వేపాడ

జాతిపితకు ఘన నివాళి



శృంగవరపుకోట: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరరావు,అధ్యాపకులు, విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లా డుతూ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహోన్నత వ్యక్తి గాంధీజీ అన్నారు. చరిత్ర ఉపన్యాసకులు శ్రీని వాసరావు పాల్గొన్నారు.

గరివిడిలో..

చీపురుపల్లి రూరల్(గరివిడి):గరివిడిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. వాసవీమాత ఆలయం వద్ద గాంధీజీ విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ మహాత్ముని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన చూపిన అహింస, సత్య మార్గాన్ని అనుసరించాలని కోరారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు వి.వి.ఎస్. స్.ఎస్.గుప్త, ఎస్.వెంకటరాజు, సతీష్, సత్యారావు, అప్పలరాజు, శంకరరావు పాల్గొన్నారు.